## క్లుప్తంగా

### 250 మందికి అన్నదానం



అన్నదానం చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

**సంతనూతలపాడు:** సేవా సంకల్ప చారిటబుల్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన కార్యక్రమంలో భాగంగా బుధవారం 40వ వారం 250 మందికిపైగా అన్నదానం చేశారు. ట్రస్ట్ మిత్రబృందం ఎన్నారై బెజవాడ శ్రీనివాసరావు, పద్మజ పాల్గొని స్థానిక ట్రస్ట్ కార్యాలయంలో అన్నదానం చేశారు. ట్రస్ట్ వైస్ చైర్మన్ పావులూరి నారాయణస్వామి చౌదరి, ట్రస్టు గౌరవాధ్యక్షురాలు షేక్ హసీనా బేగం, ట్రస్ట్ సభ్యులు కొప్పోలు శ్రీనివాసరావు, ఎస్.మల్లారెడ్డి, కె.ఆంజనేయులు, సీహెచ్ చంద్రావతి, ఎస్.ధనలక్ష్మి, షేక్ అజీరా, బి.సుధారాణి, నేతి శ్రీదేవి, డి.శివయ్య, కె.జయరాం, ఎం.శ్రీనివాసరావు, కె.రమేష్, వి.నాగరాజు, ఎస్.శ్రీనివాసరావు, మద్ది శ్రీనివాసరావు, ఏ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### వధూవరులకు చుండూరి, లంకపోతు ఆశీర్వాదం



వధూవరులను ఆశీర్వదిస్తున్న చుండూరి రవిబాబు, లంకపోతు అంజిరెడ్డి

**కొత్తపట్నం:** మండలంలోని రాజుపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ద్వారం స్వామిరెడ్డి–లత కుమారుడు ద్వారం హేమంత్‌రెడ్డి వివాహానికి బుధవారం పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు మాజీ చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, పార్టీ నాయకుడు వీరేపల్లి రామచంద్రారెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. జెడ్పీటీసీ సభ్యురాలి భర్త సైకం రాంబాబు, వెంకటనారాయణ, తాతా శ్రీను, చంద్రశేఖర్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

### పాస్టర్ల సంఘ మండల అధ్యక్షునిగా జాషువా



సంతనూతలపాడు మండల పాస్టర్ల సంఘ నూతన కమిటీ

**సంతనూతలపాడు:** పాస్టర్ల సంఘ మండల అధ్యక్షునిగా టీ జాషువాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంతనూతలపాడులోని అంబేడ్కర్ నగర్ నాలుగో లైన్‌లో గల చర్చిలో బుధవారం పాస్టర్ కేఎస్ పాల్ అధ్యక్షతన నిర్వహించిన మండల సమావేశంలో పాస్టర్ల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ఎన్నికైన పాస్టర్ జాషువాను పలువురు పాస్టర్లు అభినందించారు. సెక్రటరీగా బి.జాన్ బాబు, ట్రెజరర్‌గా కే ఇస్రాయిల్, ఉపాధ్యక్షునిగా ఎం.జాకబ్ డానియల్, జాయింట్ సెక్రటరీగా కే మోషే, గౌరవాధ్యక్షునిగా గొల్లపాడు భానుమూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీని పలువురు అభినందించారు.

# అసలే అరకొర.. ఆపై రాజకీయం.!




- సంతనూతలపాడు మండలంలో అర్హులకు అందని ద్రాక్షలా బీసీ రుణాలు
- మండలానికి కేటాయించిన యూనిట్లు కేవలం 24
- వచ్చిన దరఖాస్తులు సుమారు 400
- అడుగడుగునా టీడీపీ నేతల జోక్యం
- ఆశలు వదులుకున్న సామాన్యులు

సంతనూతలపాడు:

అరకొరగా కేటాయించిన యూనిట్లు, అధిక సంఖ్యలో వచ్చిన దరఖాస్తులకు తోడు టీడీపీ నేతల జోక్యంతో సంతనూతలపాడు మండలంలో బీసీ రుణాలు అర్హులకు అందని ద్రాక్షలా మారాయి. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు కూటమి ప్రభుత్వం బీసీ రుణాలు మంజూరు చేసేందుకు దరఖాస్తుల ప్రక్రియ చేపట్టింది. అయితే, 18 గ్రామాలున్న సంతనూతలపాడు మండలానికి కేవలం 24 యూనిట్లే కేటాయించింది. దానికితోడు దరఖాస్తుల ప్రక్రియ మొదలైన నాటి నుంచే లబ్ధిదారుల ఎంపికపై రాజకీయ జోక్యం విపరీతంగా పెరిగిపోయింది. టీడీపీ నేతలు చెప్పిన వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేయనున్నట్లు స్పష్టమవుతోంది. దీంతో అన్ని అర్హతలున్న సామాన్యులు బీసీ రుణాలపై ఆశలు వదులుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

**అసలే ఏ పథకమూ అమలు చేయక అవస్థలు..**

గత ఎన్నికలకు ముందు ఇబ్బడిముబ్బడిగా మోసపూరిత హామీలు గుప్పించి అధికారం చేజిక్కించుకున్న కూటమి ప్రభుత్వం.. ఎనిమిది నెలల పదవీ కాలంలో ఏ ఒక్క పథకాన్నీ అమలు చేసిన పాపానపోలేదు. ఏడాదికి మూడు ఉచిత సిలిండర్ల పథకాన్ని ప్రారంభించినప్పటికీ ఎంతోమంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో సబ్సిడీ నగదు జమ కావడం లేదు. వారంతా అధికారుల చుట్టూ, గ్యాస్ ఏజెన్సీల చుట్టూ తిరగలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చలేమంటూ సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వం చేతులెత్తేస్తున్న తరుణంలో ప్రజలు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఈ క్రమంలో బీసీ రుణాలు మంజూరుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా సంతనూతలపాడు మండలానికి బీసీ రుణాలు, ఎకనామికల్లీ బ్యాక్‌వర్డ్ రుణాలు కేవలం 24 యూనిట్లే మంజూరయ్యాయి. మండలంలో 18 గ్రామ పంచాయతీలు, 24 గ్రామాలు ఉండగా, కేవలం 24 యూనిట్లు ఎలా సరిపోతాయంటూ ప్రభుత్వ తీరుపై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రతి గ్రామానికి 10 నుంచి 15 యూనిట్ల వరకూ మంజూరయ్యేవని, ఈసారి ఒక్కో గ్రామానికి ఇద్దరికి కూడా రుణాలు మంజూరయ్యే పరిస్థితి లేదని ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు. పైగా, బీసీ రుణం కావాలంటే అధికార పార్టీ నేతల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి మండలంలో నెలకొనడం, లబ్ధిదారులుగా టీడీపీ వర్గీయులనే ఎంపిక చేయాలని నేతలు చెప్పడం, ఏకంగా వారే లబ్ధిదారుల పేర్లు సూచిస్తుండటంతో సామాన్యులంతా రుణాలపై ఆశలు వదుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. యూనిట్ విలువ రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ ఉండగా, ఈ రుణాలను దక్కించుకునేందుకు అధికార పార్టీ వారు గత పది రోజులుగా పార్టీలో పలుకుబడి ఉన్న నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అసలే ప్రభుత్వం మంజూరు చేసిన రుణాల సంఖ్య అంతంతమాత్రంగానే ఉండటం, వాటిని దక్కించుకునేందుకు అధికార పార్టీ కార్యకర్తలు, నాయకులే భారీ ఎత్తున పోటీపడుతుండటంతో వారిని దాటుకుని తమ వరకూ రుణాలు రావడం అసాధ్యమని గమనించిన సామాన్యులు ఉసూరుమంటూ ఊరకుండిపోతున్నారు. ప్రయత్నం చేస్తే పోయేదేముందని భావించిన కొంతమంది మాత్రమే దాదాపు రూ.500 వరకూ ఖర్చు చేసి బీసీ రుణాల కోసం ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్నారు. మండలంలో దాదాపు 40 వేల మందికి పైగా బీసీ జనాభా ఉండగా, బీసీ రుణాల కోసం 400 మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. అధికార పార్టీ జోక్యంతో పాటు యూనిట్ల సంఖ్య తక్కువగా ఉండటంతో దరఖాస్తు చేసుకునేందుకు బీసీలు ఆసక్తి చూపలేదని తెలుస్తోంది.

**రుణాల సంఖ్య పెంచాలి**

జిల్లాలో బీసీలు ఎక్కువ శాతం ఉన్నారు. ఆర్థిక వనరులు కూడా అంతంతమాత్రంగానే ఉన్నాయి. మాలాంటి నిరుద్యోగ యువకులు ఉద్యోగ అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందుల ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో స్వయం ఉపాధి కల్పించేందుకు బీసీ రుణాలు మంజూరు చేస్తున్న ప్రభుత్వం.. సంతనూతలపాడు మండలానికి అతి తక్కువ యూనిట్లు మంజూరు చేయడం దారుణం. యూనిట్ల సంఖ్య మరింత పెంచి ప్రతి గ్రామానికి కనీసం 15 నుంచి 20 మందికి రుణాలు మంజూరు చేయాలి.

– కుంచాల ఆంజనేయులు, సంతనూతలపాడు

# ఫార్మర్ రిజిస్ట్రేషన్‌తోనే ప్రభుత్వ పథకాలు



ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న చీమకుర్తి మండల వ్యవసాయ శాఖాధికారి భాస్కర్




నాగులుప్పలపాడు: రైతులతో మాట్లాడుతున్న జేడీ శ్రీనివాసరావు



సంతనూతలపాడు : రైతులకు విశిష్ట సంఖ్య నమోదు చేస్తున్న ఏవో పావని

చీమకుర్తి రూరల్:

ఫార్మర్ రిజిస్ట్రేషన్‌తోనే ప్రభుత్వ పథకాలన్నీ అందుతాయని మండల వ్యవసాయ శాఖాధికారి డీవీ భాస్కర్ తెలిపారు. స్థానిక అర్బన్ సచివాలయంలో జరుగుతున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను బుధవారం ఆయన పరిశీలించారు. వ్యవసాయ రంగంలో రైతుల సంక్షేమం, పంటల సాగుకు పెట్టుబడి సాయం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. అవన్నీ అర్హులకు అందించేలా ప్రభుత్వం ప్రత్యేకంగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ నంబర్ అందిస్తోందని తెలిపారు. అనంతరం మండలంలోని దేవరపాలెం సచివాలయం పరిధిలో పర్యటించి ఫార్మర్ రిజిస్ట్రేషన్లపై రైతులకు అవగాహన కలిగించారు. మండలంలో 7,500 మంది పీఎం కిసాన్ లబ్ధిదారులు ఉండగా, కేవలం 3,500 మంది మాత్రమే ఫార్మర్ రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారన్నారు. మిగిలిన వారు కూడా వేగంగా రైతు సేవా కేంద్రంలో నమోదు చేయించుకోవాలన్నారు. ఇందులో నమోదైన వారికి ఆధార్ మాదిరిగానే ఒక యూనిక్ ఐడీని కేంద్రం జారీ చేస్తుందన్నారు. సొంత భూమి ఉన్న రైతులు మాత్రమే ఇందులో నమోదు చేయించుకోవాలన్నారు.

**నాగులుప్పలపాడు మండలంలో...**

**నాగులుప్పలపాడు:** పొలం ఉన్న ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని చీర్వానుప్పలపాడు, పోతవరం గ్రామాల్లో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులచే బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లాలో సొంత భూమి గల ప్రతి రైతుకు 11 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య ఇస్తున్నట్లు తెలిపారు. తద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా మరింత అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. ఈ పంట గడువు ఈ నెల 25వ తేదీతో ముగుస్తున్నందున రైతులు వేసిన పంటలను వెంటనే నమోదు చేసుకోవాలని తెలిపారు. అనంతరం గ్రామంలో ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య ఇచ్చే కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి.వెంకట్రావు, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

**సంతనూతలపాడులో...**

**సంతనూతలపాడు:** మండల కేంద్రంలోని జెండా చెట్టు వద్ద వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారిణి పి.పావని పాల్గొని మాట్లాడారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం రైతులు అందుబాటులో ఉంటారని, గ్రామ వ్యవసాయ సహాయకులు రైతుల వద్దకు వెళ్లి నమోదు కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఎస్.వెంకటరావు, కేవీ సుబ్బారెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు దుర్గాప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

## నగరికంటికి బూచేపల్లి, చుండూరు పరామర్శ



బాలగురవమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, చుండూరు రవిబాబు

**ఒంగోలు సిటీ:** వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు తల్లి బాలగురవమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు బుధవారం మృతురాలు బాలగురవమ్మ దశదినకర్మకు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతురాలు కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట పార్టీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, బీసీ సెల్ అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

## కేవీ రమణారెడ్డిని సన్మానించిన చుండూరు రవిబాబు



కేవీ రమణారెడ్డిని సన్మానిస్తున్న చుండూరు రవి

**ఒంగోలు సిటీ:** వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన కేవీ రమణారెడ్డిని బుధవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా తనను నియమించిన అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, అందుకు సహకరించిన రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి, ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రీజినల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మార్కాపురం ఇన్‌చార్జ్ అన్నా రాంబాబు, మాజీ మంత్రులు మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేష్, గిద్దలూరు ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు, కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# ఉత్తీర్ణత శాతం పెంచాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ కిరణ్‌కుమార్



విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

- పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఈవో కిరణ్‌కుమార్

**మద్దిపాడు:** మండల పరిధిలోని తెల్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి ఏ కిరణ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థుల స్టడీ అవర్స్‌ను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సబ్జెక్టులపై వారికున్న విషయ పరిజ్ఞానాన్ని తెలుసుకున్నారు. పరీక్షల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ సబ్జెక్టుల్లో డౌట్‌లు ఉంటే ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకుని పరీక్షల్లో విజయం సాధించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు గత సంవత్సరం ఎంత మంది పాసయ్యారంటూ ఆరా తీశారు.

ఈ సంవత్సరం మెరుగైన ఉత్తీర్ణత సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. మార్చి 10వ తేదీ వరకు స్టడీ అవర్స్‌ని జాగ్రత్తగా నిర్వహించాలని, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయాలని ఉపాధ్యాయులకు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సంఘ సభ్యులు

**ఒంగోలు మెట్రో:** ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని ఒంగోలు మరాఠీపాలెంలో ఆరె మరాఠా సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శివాజీ ప్రతిమ వద్ద కాషాయ పతాకాలు రెపరెపలాడుతుండగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, విశ్వహిందూ పరిషత్, ఆరె మరాఠా సంఘం, వివిధ హైందవ సంఘాల ప్రతినిధులు నినాదాలు చేస్తూ శివాజీకి నివాళులర్పించారు. స్వయంసేవక్ సంఘ్ నెల్లూరు, ప్రకాశం విభాగ ప్రచారక్ నవీన్ ఛత్రపతి శివాజీ మహారాజ్ ధీరత్వాన్ని వీరత్వాన్ని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో ఆరె మరాఠా సంఘ గౌరవాధ్యక్షుడు, శివాజీ విగ్రహ దాత దయుండే ప్రభాకర్, సంస్థ అధ్యక్షుడు కాళే వెంకటేశ్వర్లు, కార్యదర్శి సోమాసి శివప్రసాద్, కోశాధికారి కాలే సుబ్బారావు, ఉపాధ్యక్షుడు జాదాం తిరుమలరావు సభ్యులు కృష్ణమోహన్, గురుబ్రహ్మం, సతీష్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ఒంగోలు నగర కార్యవాహ నాగ శ్రీను, డాక్టర్ సింగోతు ఏడుకొండలు, విభాగ్ ప్రచారక్ నవీన్, మనోజ్, ప్రకాశం జిల్లా ప్రచారక్ మహేంద్ర, పి.మాలకొండయ్య, ధనిశెట్టి రాము, పత్తి రంగమన్నార్, మండవ నాగేశ్వరరావు, విశ్వహిందూ పరిషత్ ప్రాంత సత్సంగ ప్రముఖ్ సామా సుబ్బారావు, పసుమర్తి వెంకటేశ్వర్లు, వీహెచ్పీ జిల్లా ప్రచారక్ రాధా రమణగుప్తా జంధ్యం, ఒంగోలు బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

**మరాఠీ సంఘం ఆధ్వర్యంలో...**

మరాఠీ సంఘం ఆధ్వర్యంలో మరాఠీపాలెంలోని సంఘ సభ్యులు బుధవారం ఉదయం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాళే వెంకటేశ్వర్లు, ప్రభాకరరావు, శివ, తిరుమలరావు, కాళే సుబ్బారావు పాల్గొన్నారు.

# నయన మనోహరంగా లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం

**ఒంగోలు మెట్రో:** స్థానిక తూర్పుకమ్మపాలెం ఎన్టీఆర్ విగ్రహం వద్ద బుధవారం శ్రీలక్ష్మీ నరసింహస్వామి కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేదపండితులు త్రినాథ చక్రవర్తి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా స్వామి, అమ్మవార్ల కళ్యాణ క్రతువు జరిగింది. స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, నాగ సత్యలత దంపతులు పీటలపై కూర్చున్నారు. కళ్యాణ విశిష్టత గురించి భక్తులకు చక్కగా అర్థమయ్యే విధంగా అర్చకులు వివరించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్ల కళ్యాణాన్ని తిలకించారు. ముందుగా నళినీ ప్రియ కూచిపూడి నృత్యానికేతన్ వారు ప్రదర్శించిన పద్మావతి వైభవం నృత్యరూపకం అలరించింది. కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు. మేయర్ గంగాడ సుజాత, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, కమ్మవారి సేవా సంఘ అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ, జనసేన నాయకుడు కంది రవిశంకర్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కమిటీ సభ్యులు దాచర్ల వెంకట రమణయ్య, బైరపునేని తిరుపతిరావు, బైరపునేని సన్నీ, చెన్నారెడ్డి రాంబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకుడు



పద్మావతి వైభవం కూచిపూడి నృత్య ప్రదర్శనలో నళినీప్రియ విద్యార్థులు



కళ్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

## మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలి



మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తున్న హేమలత

**ముండ్లమూరు (కురిచేడు):** మహిళలు తమ రక్షణ చట్టాలు, హక్కుల గురించి అవగాహన కలిగి ఉండాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రాష్ట్ర మహిళా ట్రైనింగ్ కో ఆర్డినేటర్ ఎం.హేమలత పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ మహిళలకు ప్రభుత్వ పథకాలపై దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఏరియా కో ఆర్డినేటర్ తప్పెట డేవిడ్ అధ్యక్షతన బుధవారం అవగాహన కల్పించారు. కో ఆర్డినేటర్ హేమలత మాట్లాడుతూ బాల్యంలో ఆడబిడ్డలకు వివాహాలు చేయరాదని, ప్రతి మహిళ తల్లిగా, భార్యగా, బిడ్డగా ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్న దేశంలో ఆడపిల్లలను రక్షించుకునేందుకు నేటికీ చట్టాలపై ఆధారపడాల్సి రావడం దురదృష్టకరమన్నారు. నేటి సమాజ అభివృద్ధిలో స్త్రీపాత్ర ఎంతో ముఖ్యమైందని కొనియాడారు. ప్రతి మహిళా అభివృద్ధి ద్వారా వారి జీవన ప్రమాణాలు పెంచుకొని ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందినప్పుడే మన కుటుంబాలు, సమాజం అభివృద్ధి చెందుతుందని మండల వెలుగు కమ్యూనిటీ కో ఆర్డినేటర్ కె.కోటేశ్వరరావు పేర్కొన్నారు. బాల్య వివాహాల నిరోధక చట్టం గురించి, గృహహింస వ్యతిరేక చట్టం, మహిళల ఆరగ్య భద్రత, మహిళలను శారీరకంగా, మానసికంగా బాధించడం, వరకట్నం కోసం డిమాండ్ చేయడం, లైంగిక వేధింపులకు గురిచేయడం, మగ పిల్లలను కనాలని చెప్పటం నేరమని గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి టి. శాంతిప్రియ తెలిపారు. సమజాభివృద్ధిని ఆ సమాజంలో మహిళల అభివృద్ధితో లెక్కిస్తారని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్న మాటలను డీబీఆర్సీ రీజనల్ కో ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు గుర్తుచేశారు. మహిళలు లేని సమాజాన్ని ఊహించటం సాధ్యం కాదన్నారు. అలాంటి ఈ సమాజంలో ఆడపిల్లల పట్ల వివక్షత హేయమన్నారు. ఆడబిడ్డ పెళ్లి కోసం కాదు.. చదువు కోసం అని ప్రతి తల్లిదండ్రులు గుర్తెరగాలన్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి మహిళలు పాల్గొన్నారు.

## పాల ఆటోను ఢీకొన్న బైకు

**దర్శి (కురిచేడు):** మండలంలోని పోతవరం వద్ద పాల ఆటోను ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఒకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. వివరాలు.. తానంచింతల నుంచి పాల క్యాన్లతో దర్శి వైపు వస్తున్న ఆటోను తానంచింతలకు చెందిన కోటేశ్వరరావు బైకు పోతవరం సమీపంలో ఢీకొట్టింది. కోటేశ్వరరావుకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడికి దర్శిలోని ప్రైవేటు వైద్యశాలలో ప్రథమ చికిత్స చేసిన వైద్యులు.. మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట తీసుకెళ్లాలని సూచించడంతో అక్కడికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.